పెట్టుబడి పెరిగి.. దిగుబడి తగ్గి...

- వర్షాలతో వరిపంటకు పెరిగిన పెట్టుబడి
- రైతులను ఉరుకులు పరుగులు పెట్టిస్తున్న వాతావరణం



కల్లంలో వరి పంటను నూర్పిడి చేస్తున్న కూలీలు

రొంపిచర్ల: ఇటీవల కురిసిన వర్షాలకు నేలవారిని వరిపంట రైతులకు దిగుబడి తగ్గి పెట్టుబడి ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోయింది. వర్షాలు కురుస్తుండటంతో వర్షం తగ్గిన తర్వాత హార్వెస్టింగ్ చేయించుకోవచ్చని వరికోతను వారం రోజులు వాయిదా వేసుకున్నందుకు నూర్పిడి ఖర్చు ఎకరాకు రూ.15 వేల రూపాయలకు చేరింది. సాధారణంగా వరి పంటను హార్వెస్టింగ్ చేయించి ధాన్యాన్ని ఇంటికి చేర్చుకునే వరకు ఐదు నుండి ఆరు వేల రూపాయల ఖర్చు అవుతుంది. వర్షానికి వరి నేలవారటంతో మిషన్లతో హార్వెస్టింగ్ చేయించటం వీలుపడలేదు. చేసేది లేక కూలీలతో వరి కోతలు నిర్వహించాల్సి వచ్చింది. ఎకరా వరి కోసినందుకు కూలీల ఖర్చు రూ.3500ల నుంచి రూ.4000 లు వరకు అవుతుంది. పనలపై ఉన్న వరి పంటను ఒక్కోచోటకు చేర్చి నూర్పిడి నిర్వహించేందుకు రూ.7000ల వరకు కూలీలకు చెల్లించాల్సి వస్తుంది. ధాన్యాన్ని తూర్పార బట్టి గోనె సంచుల్లో నింపి ఇంటికి చేర్చాలంటే మరో రూ.4 వేల రూపాయల వరకు ఖర్చు అవుతుందని రైతులు వాపోతున్నారు. దీనికి తోడు వాతావరణం పొడి బారిందని నేలవారిన వరి పంటను హడావిడిగా పక్క గ్రామాల నుంచి కూలీలను రప్పించి 7, 8 తేదీలలో వరి కోతలు నిర్వహించారు. వరి కోతలు పూర్తి అయ్యాయని పది రోజులైనా వరి పనలు ఎండకు ఎండాల్సి ఉంది. అప్పుడే నాణ్యమైన తేమ లేని వరి ధాన్యాం చేతికి వస్తుంది. నిల్వ ఉంచేందుకు కూడా ఈ ధాన్యం అనుకూలంగా ఉంటుంది. అయితే మరో తుఫాన్ ముంచుకొస్తుందని వాతావరణం మబ్బులుగా ఉండటంతో చేసేది లేక రైతులు వరి కోసిన రెండు మూడు రోజులకే కల్లాలు చేసి నూర్పిడి నిర్వహించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం ఈ పరిస్థితి కొత్తపల్లి, చాకలికుంట, ఎడ్వర్డ్‌పేట గ్రామాల్లోని ముదురుగా వరి సాగు చేసిన రైతాంగంలో నెలకొంది.



పొలంపై ఉన్న వరి పనలను కట్టలుగా కట్టి కల్లంలోకి మోస్తున్న కూలీలు

ఖర్చు పెరిగి పోయింది

మొత్తం ఐదు ఎకరాల్లో ముదురుగా వరి సాగు చేశా. అయితే వారం వ్యవధిలో మూడు ఎకరాలు, రెండు ఎకరాలు నాట్లు వేశా. ముందుగా నాట్లు వేసిన మూడు ఎకరాల వరిపైరు కొంత ఏపుగా పెరిగింది. కోతకు సిద్ధమైంది. సన్నగా వర్షాలు పడుతుండటంతో హార్వెస్టింగ్‌ను నాలుగు రోజులు వాయిదా వేసుకున్న. ఆ సమయంలో కురిసిన వర్షానికి వరి నేల వారింది. హార్వెస్టింగ్ చేయిస్తే రూ. 6000 రూపాయల పెట్టుబడితో ధాన్యం ఇంటికి చేరేది. వరి పడిపోవటం వల్ల తిరిగి వాతావరణం మారుతుందని తెలియటంతో చేసేది లేక నాల్గవ రోజే కల్లం వేయించా. వరి పనలు తేమగా ఉండటంతో నూర్పిడికి అనుకూలం లేకపోవటం వల్ల కూలీల సంఖ్య పెరిగి ఖర్చు పెరిగింది. పంట నేల వారడం వల్ల దిగుబడి కూడా తగ్గింది. వరికోత, నూర్పిడి ఖర్చు ఎకరాకు రూ.15 వేల రూపాయల వరకు అవుతుంది.

– శ్రీనివాసరెడ్డి, రైతు, కొత్తపల్లి

క్లుప్తంగా

కొండ్రముట్లలో వైభవంగా విగ్రహ ప్రతిష్ట



ఈపూరు (శావల్యాపురం): ఈపూరు మండల పరిధిలోని కొండ్రముట్లలో కోదండ రామ స్వామి విగ్రహ పునః ప్రతిష్టా మహోత్సవాలు గ్రామస్తులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణేశ్వరస్వామి, గణపతి, వీరాంజనేయ స్వాముల విగ్రహాలను ప్రతిష్టించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ చీఫ్ విప్ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లిఖార్జున రావులను ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేకంగా స్వాగతించి పూలమాలలతో సత్కరించిన అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది

15న నవోదయ మోడల్ టెస్ట్

వినుకొండ(నూజెండ్ల): స్థానిక సిద్ధార్థ నగర్ లోని గీతమ్స్ హైస్కూల్‌లో ఈ నెల 15వ తేదీన నవోదయ ఎంట్రన్స్ పరీక్ష మోడల్ గ్రాండ్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.కృష్ణవేణి తెలిపారు. గీతమ్స్ విద్యాసంస్థల వారి ఆధ్వర్యంలో జరిగే ఈ టెస్ట్ 15న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజక వర్గంలో విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలన్నారు. ఎటువంటి రుసుము లేదన్నారు. వివరాలకు 7013800787, 6304491025 నంబర్లను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

ఉపాధి హామీపై సమీక్ష



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ పథకం వినుకొండ నియోజకవర్గస్థాయి రివ్యూ మీటింగ్ బుధవారం నిర్వహించారు. ఈ సమీక్షలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.సిద్దలింగమూర్తి పాల్గొని మాట్లాడుతూ కూలీల మస్టర్లు, వంద రోజుల పనిదినాలు, గోకులాలు, పనులకు అంచనాలు, ఆమోదం తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ఏపీడీ బూసిరెడ్డి, వినుకొండ ఎంపీడీవో పుట్టారెడ్డి, శావల్యాపురం ఎంపీడీవో సీతారామయ్య, ప్లాంటేషన్ మేనేజర్ శిరీష, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభమైన ఎఫ్ఏ పరీక్షలు

యడ్లపాడు: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బుధవారం సంగ్రహణాత్మక మదింపు (ఎఫ్ఏ-1) పరీక్షలు ఉపాధ్యాయులు నిర్వహించారు. సంబంధిత ప్రశ్నాపత్రాలను మండల విద్యావనరుల కేంద్రం నుంచి అందించారు. విద్యా మార్గదర్శకాల ప్రకారం పరీక్ష నిర్వహణకు గంట ముందు మాత్రమే పాయింట్ నుంచి ప్రశ్నాపత్రాలు హెచ్‌ఎంలకు ఇవ్వడం జరిగింది. మండలంలోని 51 ప్రభుత్వ పాఠశాలల్లో విద్య అభ్యసిస్తున్న 4,066 మంది విద్యార్థులు ఈ పరీక్షలు హాజరైనట్లు రాశారు. ఇప్పటికే సిలబస్‌ను ఉపాధ్యాయులు పూర్తిచేసి విద్యార్థులను సమాయత్తం చేశారు. ఒకటి నుంచి 5 తరగతులుకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 6,8,10 తరగతులకు ఉదయం 9.15 నుంచి మధ్యాహ్నం 12.30 గంటలకు, ఇక 7,10 తరగతులకు మధ్యాహ్నం 1.15 నుంచి సాయంత్రం 4.30 గంటలకు నిర్వహించారు. పరీక్షల నిర్వహణ ప్రక్రియను మండల విద్యాశాఖ అధికారులు 1,2 టి రత్నా, ఎం. అరుణకుమారి పర్యవేక్షించారు.

డాల్ మిల్లులో చోరీ

నాదెండ్ల: గణపవరం గ్రామ రెవెన్యూ పరిధిలోని ఏఎంజీ ఎదురుగా ఉన్న డొంక రోడ్డులో రైస్ అండ్ డాల్ మిల్లులో చోరీ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై జి. పుల్లారావు తెలిపిన వివరాల మేరకు విజయ వాసవీ డాల్ అండ్ రైస్ మిల్లులో మంగళవారం తెల్లవారుజామున దొంగలు తాళాలు పగుల గొట్టి బీరువాలో ఉన్న రూ.4.35 లక్షల నగదును దోచుకెళ్లారు. మిల్లు పార్టనర్ కనకం లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం రాత్రి 10-మంగళవారం ఉదయం మధ్యలో చోరీ జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

భార్యపై సుత్తితో దాడి

చిలకలూరిపేటటౌన్: భార్యపై అనుమానం పెంచుకున్న భర్త ఆమెపై సుత్తితో దాడిచేయగా తీవ్రగాయాలతో ఆస్పత్రి పాలైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పసుమర్రు గ్రామానికి చెందిన గుంజి నాగరాజు, గుంజి ఆదిలక్ష్మి దంపతుల మధ్య అనుమానం అనే వివాదంతో చిన్నపాటి గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి సుమారు 8.30 గంటలకు ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో ఆవేశంగా నాగరాజు భార్య ఆదిలక్ష్మి తలపై సుత్తితో మోదాడు. తీవ్ర గాయాలు కావడంతో ఆదిలక్ష్మిని పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్సలు చేశారు. అనంతరం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ఆదిలక్ష్మి కుమారుడు గుంజి నవీన్‌గోపి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ జి.అనిల్‌కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హాస్టల్ నిర్వహణపై ఆర్డీవో ఆగ్రహం

- నూజెండ్లలో ఆకస్మిక పర్యటన
- సమస్యలపై ఘొల్లుమన్న విద్యార్థులు
- వార్డెన్‌పై విచారణ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్డీవో మధులత

వినుకొండ (నూజెండ్ల): కలెక్టరు ఆదేశాలు మేరకు నూజెండ్లలోని బీసీ సంక్షేమ బాలుర వసతిగృహాన్ని నరసరావుపేట ఆర్డీవో కె.మధులత ఆకస్మికంగా బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మధులత మాట్లాడుతూ ఇటీవల వసతి గృహ నిర్వహణ తీరుపై ఫిర్యాదులు రావటంతో క్షేత్ర స్థాయిలో పరిశీలనకు వచ్చానన్నారు. అనంతరం ఆమె విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకొన్నారు. వాటి పరిష్కార దిశగా చర్యలు చేపట్టామన్నారు. బాలుర వసతి గృహంలో కనీసం మరుగుదొడ్లు సక్రమంగా లేకపోవటంతో పాటు ప్రహరీ కూడా లేదని, దీనివల్ల విషసర్పాలు వస్తున్నాయని విద్యార్థులు ఆర్డీవో ఎదుట వాపోయారు. మెనూ కూడా పాటించటం లేదని వార్డెన్ ఇష్టానుసారంగా వ్యవరిస్తున్నారన్నారు. విద్యార్థులకు అందించిన మంచాలను సైతం మూలన పడేవేశారన్నారు. విద్యార్థులు సమస్యలతో సహజీవనం చేస్తుంటే మండల స్థాయి అధికారులు ఏం చేస్తున్నారని ఆర్డీవో ప్రశ్నించారు. వసతి గృహంలో వార్డెన్ లేకపోవటంతో ఆర్డీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్డెన్‌పై విచారణ చేయించి తదుపరి కలెక్టరు ఆదేశాలు మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులు చెప్పిన సమస్యలన్నీ జిల్లా కలెక్టరుకు నివేదికను అందజేస్తామన్నారు. డిప్యూటీ తహసీల్దారు కె.బాల వెంకటేశ్, వీఆర్వో నాసర్ సాహెబ్ తదితరులు ఉన్నారు.

14న నీటి సంఘాల ఎన్నికలు

ఏకాభిప్రాయం కుదరకుంటే ఓటింగ్‌కు ఏర్పాట్లు



నోటీసు బోర్డులో కమిటీ వివరాలను ఉంచుతున్న ఏవో హరిప్రసాద్

నాదెండ్ల: ఈ నెల 14న నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎన్నికలకు సంబంధించిన వివరాలను అందుబాటులో ఉంచారు. ఇప్పటికే నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఆయా గ్రామాల్లో ఓటర్ల జాబితాను ఆయా రాజకీయ పార్టీల నాయకులకు అందించారు. ఈ నెల 14న ఉదయం 9 గంటలకు టీసీల వారీగా సమావేశాలు నిర్వహించనున్నారు. ఏకాభిప్రాయం కుదరకుంటే చేతులెత్తే పద్ధతి ద్వారా లేదా స్లిప్పుల ద్వారా ఓటింగ్ ప్రక్రియను 9.15-9.45 గంటల మధ్య నిర్వహించనున్నారు. 10.15 గంటల లోపు నామినేషన్లు పరిశీలించి టీసీల వారీగా డిక్లేర్ చేయనున్నారు.
10.30-12.30 గంటల మధ్య ఓటింగ్ నిర్వహిస్తారు. 12.30-1 గంటలలోపు ఓట్లు లెక్కించి ఫలితాలు వెల్లడించనున్నారు. సాయంత్రం 3-5 గంటలలోపు ఎన్నిక కాబడిన టీసీలను సమావేశపరచి ఆ నీటి యాజమాన్య కమిటీ ఛైర్మన్‌ను ఎంపిక చేయనున్నారు. నాదెండ్ల మండల పరిధిలో 10 నీటి యాజమాన్య కమిటీలు ఉండగా చిరుమామిళ్ళ, కనపర్రు, ఇర్లపాడు, నాదెండ్ల1-2-3, సాతులూరు1-2, గణపవరం, తూబాడు సంఘాలకు ఎన్నికలు జరపాల్సి ఉంది. ఎన్నికల నిర్వహణను ఇరిగేషన్ శాఖ నిర్వహించనుంది.

వేర్వేరు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు



ముక్కెళ్లపాడులో రైతుతో మాట్లాడుతున్న ఆర్డీవో మధులత



వెల్లటూరు రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్

వినుకొండ (నూజెండ్ల): మండలంలోని ముక్కెళ్ళపాడు రెవెన్యూ గ్రామంలో రెవెన్యూ సదస్సు బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీవో కె.మధులత పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈనెల 6 నుంచి సదస్సులు ప్రారంభమైయ్యాయని నరసరావుపేట డివిజన్ పరిధిలో మూడు రోజుల వ్యవధిలో 200 అర్జీలు రైతులు నుంచి రెవెన్యూ అధికారులు స్వీకరించినట్లు తెలిపారు. రెవెన్యూ సదస్సులో మ్యూటేషన్ అర్జీలు తదితరవన్నీ ఎలాంటి రుసుం చెల్లించాల్సిన ఆవశ్యకత లేకుండా సత్వరమే పరిష్కార దిశగా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకుంటామన్నారు. రైతులిచ్చిన అర్జీ సమగ్ర వివరాలన్నీ ఆన్‌లైన్ నమోదు చేస్తామన్నారు. ప్రజలకు జవాబుదారీగా రెవెన్యూ అధికారులు సిబ్బంది అంకిత భావంతో తమ విధులు నిర్వహించాలన్నారు. రెవెన్యూ సదస్సులో 30 దరఖాస్తులు అందినట్లు తహసీల్దారు ఆర్.రమేష్‌కుమార్ తెలిపారు. ఈసదస్సులో సర్వేయర్ సల్మాన్, వీఆర్వో జ్యోతి సచివాలయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

యడ్లపాడులో...

యడ్లపాడు: భూ సమస్యల పరిష్కారం కోసం మండలం పరిధిలో అధికారులు నిర్వహిస్తున్న గ్రామ సభలలో మూడో రోజు కూడా రైతుల నుంచి రెండు అర్జీలు మాత్రమే అందాయి. యడ్లపాడు మండలం సొలస గ్రామంలో బుధవారం గ్రామ రెవెన్యూ సదస్సును అధికారులు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జెడ్పీ విజయశ్రీ పాల్గొని రెవెన్యూ సమస్యలు, సదస్సు నిర్వహణ గురించి ప్రజలకు వివరించారు. అనంతరం గ్రామ రైతులు రెండు అర్జీలు అధికారులకు సమర్పించారు. తొలిరోజు వంకాయలపాడు రెవెన్యూలో నిర్వహించిన సదస్సులోనూ రెండు అర్జీలు, ఆ తర్వాత మైదవోలు సదస్సులోనూ రెండు అర్జీలు, మూడోరోజు నిర్వహించిన సొలస గ్రామంలోనూ రెండు అర్జీలు మాత్రమే వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో రెవెన్యూ మండల సర్వే గేరా సురేంద్రనాథ్, వీఆర్వో జయరాజు, దేవాదాయ శాఖ ఈవో రఘునాథరెడ్డి, స్థానిక రైతులు, ప్రజలు పాల్గొన్నారు

వెల్లటూరులో...

బొల్లాపల్లి: భూ రెవెన్యూ సమస్యల పరిష్కార ఉద్దేశమే రెవెన్యూ సదస్సులు అని తహసీల్దార్ ఏపీ సుధాకర్ తెలిపారు. మండలంలోని వెల్లటూరు గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ సమస్యలపై అర్జీలను అందజేయాలని, విచారించి పరిష్కరిస్తామని అన్నారు. అర్జీల్లో పింఛన్లు, రేషన్ కార్డులు, కుల, ఆధాయ ధ్రువీకరణ పత్రాలు, భూములకు సంబంధించి 15 అర్జీలు అందాయని తహసీల్దార్ తెలిపారు. ఈ సదస్సులో వీఆర్వోలు నరసింహారావు, రవినాయక్, రెవెన్యూ సిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలకు ముప్పాళ్ళ విద్యార్థులు





ఈపూరు (శావల్యాపురం): సౌత్ జోన్ వాలీబాల్ పోటీలకు ఈపూరు మండలం ముప్పాళ్ళ ధనలక్ష్మి వ్యాయమా కళాశాలకు చెందిన ఇరువురు విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చుండు వెంకటరావు ఒక ప్రకటనలో బుధవారం తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కళాశాలకు చెందిన ఎస్‌కె. కలాముద్దీన్ (ప్రథమ యం.పి.ఇడి) ఎస్‌కె.ఉస్మాన్ (బి.పి.ఇడి)లు ఈనెల 9,10 తేదీల్లో గుంటూరు ఆర్‌వీఆర్, జెసీ ఇంజినీరింగ్ కళాశాలల్లో జరిగిన అంతర్ కళాశాలల పోటీల్లో పాల్గొని ఎంపికై నట్లు తెలిపారు. ఈనెలఖారులో యూనివర్సిటీ ఆఫ్ కేరళలో జరుగు దక్షిణ మండలం అంతర్ విశ్వ విద్యాలయంలో సౌత్ జోన్ వాలీబాల్ క్రీడా పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపికై నా విద్యార్థులను కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ మేదరమెట్ల రామ శేషగిరిరావు, అధ్యాపకులు ఆర్‌బీ నాయక్, అరవింద్, దాసు, వంశీలు ప్రత్యేకంగా అభినందించారు.

విధిగా హెల్మెట్ ధరించండి



రొంపిచర్ల: వాహనం నడిపేటప్పుడు విధిగా హెల్మెట్ ధరించి సెల్‌ఫోన్ మాట్లాడటం ఆపాలని డీఎస్పీ కె. నాగేశ్వరరావు అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం వార్షిక తనిఖీలు నిర్వహణ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో క్రైం రేట్ తక్కువగా ఉందన్నారు. గ్రామాల్లో శాంతి భద్రతల విషయంలో ఎస్ఐ అశోక్ కఠినంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. హైవేపై ప్రమాదాల సమస్య కొంత ఎక్కువగా ఉందన్నారు. ప్రమాదాల రేటును తగ్గించేందుకు ఫేస్ వాష్ లాంటి కార్యక్రమాలను తిరిగి చేపడతామన్నారు. డంక్ అండ్ డ్రైవ్ వల్ల, నిద్రమత్తులో వాహనాలు నడపటంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. హైవేపై ఆటోల రాకపోకలు తగ్గించటంతో పాటు వాహనాల పార్కింగ్ కూడా ఎక్కడ పడితే అక్కడ చేయకుండా సహకరించాలన్నారు. డ్రైవర్ అజాగ్రత్త, నిర్లక్ష్యం వల్లే ప్రమాదాలు పెరిగి ఎన్నో జీవితాలు నాశనం అవుతున్నాయన్నారు. ఇటీవల విప్పర్లపల్లి గ్రామంలో కూడా పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించి గ్రామంలోని సమస్యలపై అక్కడి వారితో చర్చించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ పి. రామకృష్ణ పాల్గొన్నారు.

కే-రిడ్జిలో విదేశీ భాషలపై సదస్సు



విదేశీ భాషా పండితుడు వెంకట్‌ను సత్కరిస్తున్న కే-రిడ్జి స్కూల్ ప్రతినిధులు

నరసరావుపేట ఈస్ట్: వేగంగా మార్పులకు గురవుతున్న ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రపంచ భాషలపై అవగాహన కలిగి ఉండాలని బహుభాషావేత్త వెంకట్ పూలబాల తెలిపారు. గుంటూరు రోడ్డులోని కే-రిడ్జి పాఠశాలలో బుధవారం పోలీగాట్ (బహు భాషావాదం)పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన వెంకట్ మాట్లాడుతూ, విద్యార్థి దశలోనే ఇంగ్లిష్‌తో పాటు ఇతర దేశాల భాషల పట్ల అవగాహన పెంచుకునే దిశగా కృషి చేయాలని తెలిపారు.
కే-రిడ్జి పాఠశాలలో విదేశీ భాషలు నేర్పించటం అభినందనీయమని తెలిపారు. ఫ్రెంచ్, జర్మన్, జపనీస్, స్పానిష్, ఇటాలియన్ భాషలలో ప్రవేశం ఉన్న వెంకట్ కే-రిడ్జి పాఠశాల విద్యార్థులకు ఆయా భాషలలో శిక్షణ అందించారు. శిక్షణ పొందిన విద్యార్థులు ఆయా భాషలలో స్వాగత వచనాలు, పాటలతో సభికులను అలరించారు. కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, కోమటినేని నాసరయ్య, ప్రిన్సిపల్ బర్నబాస్, క్యాంపస్ ఇన్‌ఛార్జ్ కోట బాపూజీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామాల అభ్యున్నతి కోసమే శిక్షణ

- ఎంపీడీవో వి.హేమలతాదేవి
- రెండోరోజు కొనసాగిన శిక్షణ



శిక్షణ అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులు

యడ్లపాడు: గ్రామాల అభ్యున్నతి కోసమే పలు అంశాలపై అధికారులకు, ప్రజాప్రతినిధులకు శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీవో వి.హేమలత దేవి చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో బుధవారం సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు స్థానికరణంపై మండల స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని రెండోరోజు కొనసాగింది. రాష్ట్రీయ గ్రామస్వరాజ్, రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి, పంచా యతీ రాజ్ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీవో హేమలతా దేవి మాట్లాడుతూ శిక్షణకు హాజరైన వారంతా తమ గ్రామాల అభ్యున్నతి కోసం కృషి చేయాలని కోరారు. ఇదే శిక్షణ రెండో బ్యాచ్‌కు ఈనెల 12,13 తేదీలలో ఉంటుందని, పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు విధిగా హాజరై సదరు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రెండోరోజు శిక్షణలో ఈఓపీఆర్డి షేక్ జాకీర్ హుస్సేన్, ఏవో కేఎస్ బి సాయి శ్రీనివాస్, మండల స్థాయి అధికారులు హాజరయ్యారు.

గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో సీతారామయ్య

శావల్యాపురం: పేదరికం లేని గ్రామపంచాయతీలు అభివృద్ధికి అందరు తమవంతు సహకారం అందించాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. బుధవారం రెండవరోజు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై మండల స్థాయి అధికారులు సర్పంచుల, సచివాలయ సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సీతారామయ్య మాట్లాడుతూ సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించటానికి స్థానికీకరణ ఆవశ్యకతపై మండల స్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామ పంచాయతీల్లో స్వయం సమృద్ధిగా మౌలిక సదుపాయాలు కల్పించటంలో ప్రజాప్రతినిధులు కీలకపాత్ర పోషించాలన్నారు. పంచాయతీ విధులు, నిధులు, వినియోగంపై సర్పంచులు వార్డు సభ్యులు అవగాహన కల్గియుండాలన్నారు. ఆరోగ్యవంతంగా సుపరిపాలన కోసం పాటు పడాలన్నారు. పచ్చదనం-పరిశుభ్రత కల్గియున్న గ్రామ పంచాయతీలను తయారు చేయాలన్నారు. ఈ శిక్షణ తరగతుల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజరు కుప్పం శ్రీలత, ఈవోపీఆర్‌డీ పి.సుగుణ, సూపర్‌వైజరు అలవలపాటి ఏడుకొండలు, ఏపీవో కె.రామారావు, ఏపీయం జి.వాసుబాబు తదితరులు పాల్గొన్నారు.

చెట్ల నరికివేతపై గ్రామస్తుల ఆగ్రహం

- కంపెనీలో ఎండుటాకులు పడుతున్నాయంటూ చెట్ల నరికివేత
- ఇరవై ఏళ్ళ వయస్సున్న పచ్చటి చెట్ల నరికివేతతో గ్రామస్తుల అసహనం



గణపవరం మెయిన్‌రోడ్డులో చెట్లను నరికి వేయటంతో మిగిలిన మొండేలు

నాదెండ్ల: గణపవరం జాతీయ రహదారి నుంచి గ్రామంలోకి వెళ్ళే ప్రధాన రహదారికి ఇరువైపులా నాటిన చెట్లను కొంతమంది నరికివేయటంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2004లో అప్పటి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ హయాంలో జాతీయ రహదారి నుంచి రామాలయం వరకూ డబుల్ రోడ్ వేసి సెంట్రల్ డివైడర్ ఏర్పాటు చేశారు. హైవే నుంచి ప్రాథమిక పాఠశాల వరకూ సెంట్రల్ డివైడర్‌లో పూలమొక్కలు, చెట్లు నాటారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఇరవై ఏళ్ల క్రితం నాటిన మొక్కలు పెద్ద చెట్లయ్యాయి. ప్రస్తుతం ఓ కంపెనీకి సంబంధించిన యాజమాన్యం చెట్లను పూర్తిగా కొమ్మల్లేకుండా నరికి రోడ్డుపై పడవేశారు. ప్రతినిత్యం పంచాయతీ పారిశుధ్య కార్మికులు ఈ చెట్ల నుండి రాలిన ఆకులను ఏరివేస్తూ, ట్యాంకర్‌ద్వారా నీరందిస్తూ సంరక్షిస్తున్నారు. రోడ్డుపై చల్లటి నీడనిస్తున్న చెట్లను అర్థాంతరంగా నరికి మొండేలను చేయటంపై స్థానికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి మారుతిబాబును వివరణ కోరగా పంచాయతీ అనుమతి లేకుండా చెట్లను నరికారని, ప్రస్తుతం నిలుపుదల చేయించామన్నారు. చెట్లను ఎందుకు నరికారనే వివరణ తీసుకుంటామని తెలిపారు.

ఐక్యతతోనే సమస్యల పరిష్కారం

చిలకలూరిపేట: మున్సిపల్ కార్మికులు ఐక్యంగా మెలిగి సమస్యలు పరిష్కరించుకోవాలని సీపీఐ ఏరియా ఇన్‌చార్జి కార్యదర్శి తాళ్లూరి బాబురావు తెలిపారు. బుధవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ అనుబంధ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగుపరచడంలో మున్సిపల్ కార్మికుల పాత్ర ఎంతో కీలకమని, అలాంటి వారికి కనీస వసతులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అనేక సమస్యల నడుమ మున్సిపల్ కార్మికులు పనిచేస్తున్నారని, మున్సిపల్ అధికారులు కానీ ప్రజా ప్రతినిధులు గాని వారి సమస్యలు పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. పట్టణ జనాభా దృష్టిలో పెట్టుకొని కార్మికుల సంఖ్యను పెంచాలని, కార్మికులకు పనిభారం తగ్గించాలని. ఇంజినీరింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని కోరారు. ఈఎస్ఐ,పీఎఫ్ సమస్యలు తక్షణమే పరిష్కరించాలన్నారు.

ఘనంగా గీతా జయంతి



నరసరావుపేట ఈస్ట్: బరంపేటలోని శ్రీరాధా గోవింద చంద్రమందిరం ఇస్కాన్ ఆలయంలో బుధవారం గీత (భగవద్గీత) జయంతిని ఘనంగా నిర్వహించారు. ఉదయం మూలమూర్తులకు అభిషేకాలు, అలంకరణ, పూజలు నిర్వహించి భగవద్గీత గ్రంథాలను మూలవరుల చెంత అలంకరించారు. ఆలయ నిర్వాహకులు వైష్ణవ ప్రభుదాస్ ఆధ్వర్యంలో మహిళలు గీతా పారాయణం, విద్యార్థులకు భగవద్గీతపై క్విజ్, ప్రతిభా పరీక్ష, భగవద్గీత తులాభారం నిర్వహించారు. పోటీల విజేతలకు ఈనెల 15వతేది ఆదివారం సాయంత్రం బహుమతులు అందచేస్తామని నిర్వాహకులు తెలిపారు.

వర్సిటీ మహిళా బాస్కెట్‌బాల్ విజేత వాగ్దేవి



నరసరావుపేట ఈస్ట్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల మహిళా బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లో వాగ్దేవి కళాశాల జట్టు విజేతగా నిలవటంతోపాటు ముగ్గురు విద్యార్థినిలు వర్సిటీ జట్టుకు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపల్ కపలవాయి రాజేంద్రప్రసాదు బుధవారం తెలిపారు. వర్సిటీ క్రీడాప్రాంగణంలో ఈనెల 6, 7తేదీలలో నిర్వహించిన పోటీలో తమ కళాశాల జట్టు ప్రథమస్థానం సాధించటంతోపాటు సి.హెచ్.సింధూర, డి.అమూల్య, షేక్.దిల్ అఫ్రోజ్‌లు వర్సిటీ జట్టుకు ఎంపికైనట్టు వివరించారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 20 నుంచి 23వతేదీ వరకు కేరళ రాష్ట్రం కొట్టాయం లోని మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలో జరగనున్న సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ మహిళా బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లో ఏఎన్‌యూ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. విద్యార్థినులను కళాశాల కార్యదర్శి రాయల శ్రీనివాసరావు, డైరెక్టర్లు కాట్ల రామకోటేశ్వరావు, ఓగూరి నాగేశ్వరావు, మద్దుల కోటేశ్వరరావు అభినందించారు.